సాక్షి
ఖమ్మం
సోమవారం । 18 । ఆగస్టు । 2025



ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఆరోగ్య మిత్రల కొరతతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలకు అంతరాయం కలుగుతోంది. 8లో



కిన్నెరసానిలో 'సఫారీ'

రాష్ట్రంలోని అమ్రాబాద్, కవ్వాల్ తరహాలో కిన్నెరసాని అభయారణ్యంలోనూ సఫారీ వాహనం ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
26° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన మహిళల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సీనియర్ మహిళల, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేజెల్ల సురేష్, బొంతు శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 80 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారని, ఎంపిక చేసిన జట్లను ఈనెల 23, 24 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు. మహిళల జట్టులో జస్వతి, శ్రీహర్షిని, మధులత, అకాంక్ష, సాహితి, రాజేశ్వరీ, కరీనా, మనీషా, స్మైలీ, వ్యూహిత, అక్షయ ఎంపిక కాగా, పురుషుల జట్టులో బి.గోపి, శ్రీకాంత్, పవన్, కళ్యాణ్, మున్నా, నునావత్ గోపి, నవీన్, ప్రశాంత్, లాకేష్, విజయ్, కళ్యాణ్, జయదీప్ చోటు దక్కించుకున్నారని తెలిపారు.

పవర్ డిప్లొమా ఇంజనీర్ల నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం నగరంలోని విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎం.ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మల్లికార్జున్, కంపెనీ సలహాదారు మధుసూదన్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించగా.. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.సుధాకర్ రెడ్డి ఎలక్షన్ అధికారిగా వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.వెంకట్, కార్యదర్శిగా నాగమల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జె.ప్రభాకర్ రావు, ట్రెజరర్‌గా నాగరాజు, మహిళా ప్రతినిధిగా నవ్యశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మున్నేరు పరీవాహకంలో పంటల పరిశీలన



పొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: వరద ఉధృతి నేపథ్యంలో మున్నేరు పరీవాహక ప్రాంతంలోని పంటలను జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నదీ పరీవాహకంలో వరి పైర్లు దుబ్బుదశలో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎప్పటికప్పుడు పంటలను పర్యవేక్షిస్తూ రైతులకు తగిన సలహాలు అందించాలని స్థానిక వ్యవసాయాధికారులకు సూచించారు. ఆయన వెంట ఖమ్మం అర్బన్ ఏఓ కిషోర్ బాబు, ఏఈఓ దివ్య తదితరులు ఉన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు జిల్లాల నుంచి కూడా సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 619 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.33,310 ఆదాయం లభించింది. 320 మంది బోటు షికారు చేయగా ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.15,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.





మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న నిపుణులు

మట్టి మేలు తల పెట్టవోయ్ !

మట్టి గణపతులకు పెరుగుతున్న ప్రాధాన్యం

- ఖమ్మంలో భారీగా ప్రతిమల తయారీ..
- అందుబాటులో 5 – 16 అడుగుల విగ్రహాలు
- పర్యావరణ పరిరక్షణకు మేలంటున్న పలువురు

ఖమ్మంగాంధీచౌక్ : వినాయక ఉత్సవాల్లో పర్యావరణానికి ప్రాధాన్యత పెరుగుతోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో అనర్థాలు చోటుచేసుకుంటుండగా.. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాల ప్రాధాన్యం పెరిగింది. జిల్లాలో వేల సంఖ్యలో గణపతి ఉత్సవ మండళ్లు ఉండగా, ఒక ఖమ్మం నగరంలోనే 1000కి పైగా మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 27న జరిగే వినాయక చవితి పండగను పురస్కరించుకుని ఇప్పటికే పలు చోట్ల పీఓపీ విగ్రహాలను విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. మరో వైపు నగరంలోని బైపాస్ రోడ్ రాపర్తినగర్. ఇల్లెందు రోడ్ తదితర ప్రాంతాల్లో మట్టి విగ్రహాలు తయారవుతున్నాయి. విగ్రహం మోడల్ ఫొటో చూపిస్తే సిద్ధం చేస్తామని తయారీదారులు చెబుతున్నారు. కొందరు పశ్చిమ బెంగాల్ నుంచి మట్టి విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుండగా, మరి కొందరు ఇక్కడే తయారు చేస్తున్నారు.

పీఓపీతో నీటి కాలుష్యం..

గణేష్ ఉత్సవాల సమయంలో రంగురంగుల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు విక్రయిస్తుంటారు. నవరాత్రి వేడుకల తర్వాత ఆ విగ్రహాలను నదులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తుండగా నీరు కాలుష్యమై జలరాశులు మనుగడ దెబ్బతింటోంది. తాగునీటి జలాశయాలు కలుషితం అవుతున్నాయి. నీటిలో ప్రయోజనం కలిగించే సూక్ష్మ జీవులు మొదలు.. పెద్ద జీవుల వరకు నశించిపోతున్నాయి.

మట్టి విగ్రహాలే మేలు..

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో అనర్థాలు చోటు చేసుకుంటుండడంతో ప్రత్యామ్నాయంగా మట్టి విగ్రహాలను పర్యావరణవేత్తలు ప్రోత్సహిస్తున్నారు. పీఓపీ విగ్రహాలతో కలిగే నష్టాలు, మట్టి విగ్రహాలతో ప్రయోజనాలపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. దీంతో కొందరు బంకమట్టి, వరిపొట్టు, వరిగడ్డి, కలకత్తా నుంచి గంగామట్టిని తీసుకొచ్చి వెదురు బొంగులు, సర్వే కర్రల సాయంతో విగ్రహాలు తయారు చేసి వాటర్ కలర్స్ దిద్దుతున్నారు. ఈ మట్టి విగ్రహాలతో నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఖమ్మంలో తయారుచేసే మట్టి విగ్రహాలకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విజయవాడ, సత్తెనపల్లి, గుంటూరు, కడప నుంచి కూడా ఆర్డర్లు వస్తుండడం విశేషం. ఇక్కడ 5 నుంచి 16 అడుగుల ఎత్తు వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. సైజు, రూపాన్ని బట్టి రూ.10 వేల నుంచి ఆపైన ధరలతో విక్రయిస్తున్నారు.



మట్టి వినాయక విగ్రహాలు

మట్టి విగ్రహాలకు క్రేజ్ పెరుగుతోంది



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం పెరిగింది. మండప నిర్వాహకులు ఈ విగ్రహాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. పీఓపీతో కలిగే అనర్థాలపై పర్యావరణవేత్తల ప్రచారం కూడా దీనికి దోహదపడుతోంది. ప్రతి ఏటా మట్టి విగ్రహాలు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతోంది.

– గూడూరు దయాకర్,
మట్టి విగ్రహాల కేంద్రం నిర్వాహకుడు

మోడల్ చూపిస్తే తయారు చేస్తాం



మండప నిర్వాహకులు మోడల్ ఫొటో చూపిస్తే మట్టి విగ్రహాలు తయారుచేస్తాం. పర్యావరణానికి హాని చేయని సామగ్రిని ఉపయోగిస్తున్నాం. విగ్రహాల తయారీ, విక్రయాలతో ఆరు నెలల పాటు ఉపాధి పొందుతాం. విగ్రహం తడవకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

– మిలాన్,
విగ్రహ తయారీ నిపుణుడు, పశ్చిమబెంగాల్

మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తున్నాం



మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తున్నాం. నిమజ్జనం తర్వాత పీఓపీతో అనర్థాలు, మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం. మండప నిర్వాహకుల్లో కూడా ఈ విగ్రహాలపై అవగాహన పెరుగుతోంది. నగరంలో మట్టి విగ్రహాల వినియోగం గణనీయంగా పెరిగింది.

– వినోద్ లాహోటీ,
స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఖమ్మం

పర్యావరణ పరిరక్షణకు మేలు



పీఓపీ విగ్రహాల నిమజ్జనం తర్వాత చెరువులు, నదుల్లోని నీరు కలుషితమై జీవకోటిని అనారోగ్యం పాలు చేస్తున్నాయి. నీటిలో ఉన్న జీవులు చనిపోతున్నాయి. ఆ నీటిని తాగిన మనుషులు కూడా వ్యాధుల బారిన పడుతున్నారు. మట్టి విగ్రహాలు వినియోగిస్తేనే పర్యావరణానికి మేలు కలుగుతుంది.

– డాక్టర్ కదవెండి వేణుగోపాల్,
పర్యావరణ వేత్త, ఖమ్మం

మున్నేరు తగ్గుముఖం

- ఊపిరి పీల్చుకున్న అధికారులు, ముంపు ప్రాంత ప్రజలు
- శనివారం అర్ధరాత్రి తర్వాత తగ్గిన వరద
- తెల్లవార్లూ పరిశీలిస్తూ అప్రమత్తమైన అధికారులు



ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మున్నేరు వద్ద కేఎంసీ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్ : రెండు రోజులుగా మున్నేరు వరద ఉధృతి పెరగడంతో భయాందోళనకు గురైన ఖమ్మం ప్రజల్లో ప్రస్తుతం ఊరట నెలకొంది. శనివారం అర్ధరాత్రి వరకు కాల్వొడ్డు వద్ద నీటి మట్టం 15 అడుగుల వరకు పెరిగి భయాందోళన కలిగించింది. అయితే ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల నుంచి వరద క్రమంగా తగ్గుతూ సాయంత్రం 4 గంటలకు 11 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. శనివారం ఉదయం 9.5 అడుగుల మేర వరద ఉండగా.. ఎగువ ప్రాంతాల నుంచి నీటి ఉధృతి పెరగడంతో రాత్రి 8 గంటల వరకు 15 అడుగులకు చేరింది. 15.10 అడుగుల వద్ద సుమారు ఐదు గంటల పాటు నిలకడగా కొనసాగడంతో అధికారులంతా అప్రమత్తమయ్యారు. దాదాపు 24 గంటల పాటు పర్యవేక్షణ కొనసాగించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, పోలీసు విభాగాల సమన్వయంతో ప్రత్యేక బృందాలను కూడా సిద్ధం చేశారు. అదృష్టవశాత్తూ నీటి మట్టం తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అధికారులు పర్యవేక్షణలోనే..

జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో వర్షపాతం మళ్లీ పెరగకుండా ఉంటే పెద్దగా ముప్పు ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. అయినా నిర్లక్ష్యం చేయరాదని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బొక్కలగడ్డ, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్ ప్రాంతాలను అధికారులు నిరంతరం సందర్శిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతంలో జరిగిన నష్టం పునరావృతం కాకుండా శనివారం రాత్రి అంతా మున్నేరు పరీవాహక ప్రాంతంలోనే గస్తీ కాశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనలతో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఎస్‌ఈ రంజిత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, డీఈ ధరణికుమార్, టీపీఎస్ సంతోష్ మున్నేరు వరదను నిరంతరం పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు వరద 13.5 అడుగులకు, రాత్రి 8 గంటలకు 10.5 అడుగులకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సందర్శకులు రాకుండా కట్టుదిట్టం

మున్నేరుకు వరద పోటెత్తడంతో శనివారం మధ్యాహ్నం నుంచి సందర్శకుల తాకిడి పెరిగింది. కాల్వొడ్డుతో పాటు ప్రకాశ్‌నగర్ వద్ద ప్రజలు మున్నేటి వరదను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు వారిని బ్రిడ్జిపైకి రాకుండా అడ్డుకున్నారు. వరదల సమయంలో మున్నేరు వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు అనుమతి లేదంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

రైల్వేస్టేషన్‌లో టికెట్ కౌంటర్ ప్రారంభం

హర్షం వ్యక్తం చేసిన నాగులవంచ, పరిసర గ్రామాల ప్రజలు



టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

చింతకాని : మండల పరిధిలోని నాగులవంచ రైల్వేస్టేషన్‌లో మూడు నెలలుగా నిలిచిపోయిన టికెట్ కౌంటర్ సేవలను ఖమ్మం రైల్వేస్టేషన్ చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ గంగిశెట్టి శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ప్రయాణికుల నుంచి ఆదరణ తగ్గిందనే కారణంతో నాగులవంచ రైల్వేస్టేషన్‌ను మూసివేస్తున్నట్లు ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బి.సునీత సర్క్యులర్‌ను జారీ చేశారు. దీంతో స్టేషన్‌ను కొనసాగించాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టగా తిరిగి యథావిధిగా కొనసాగిస్తున్నట్లు ఈనెల 14న మళ్లీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం టికెట్ కౌంటర్‌ను ప్రారంభించడంతో నాగులవంచ, నాగులవంచ రైల్వేస్టేషన్, పాతర్లపాడు, రామాపురం తదితర గ్రామాల వారు టికెట్లు కొనుగోలు చేసి ప్యాసింజర్ రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు రైలులోనే ప్రయాణించాలని, తప్పనిసరిగా టికెట్లు కొనుగోలు చేసి స్టేషన్ ఆదాయం పెంచాలని కోరారు. కాగా, కాంట్రాక్ట్ పద్ధతిన కాకుండా రెగ్యులర్ టికెట్ బుకింగ్ క్లర్క్‌ను నియమించాలని, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళ విజయవాడ నుంచి డోర్నకల్ వెళ్లే ప్యాసింజర్ రైలును నాగులవంచ రైల్వేస్టేషన్‌లో నిలపాలని ఆయా గ్రామాల వారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం రైల్వేస్టేషన్ కమర్షియల్ సూపర్‌వైజర్ సూరపల్లి శేషుకుమారి, వివిధ పార్టీల నాయకులు బొర్రా ప్రసాద్‌రావు, ఆలస్యం బస్వయ్య, నాగమణి, వెచ్చా మంగపతిరావు, మద్దినేని నాగేశ్వరరావు, తేలుకుంట్ల శ్రీనివాసరావు, తాళ్లూరి రాము, కొండా గోపి, మద్దినేని వెంకటేశ్వరరావు, వంకాయలపాటి సత్యం, కొల్లి బాబు, కోపూరి నవీన్, పరిటాల యలమంద, తొండపు వేణు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏలో అవినీతిని వెలికితీయాలి

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ చెప్పే లెక్కలన్నీ అసత్యాలేనని, అందులో జరిగే అవినీతిని వెలికితీయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని సీక్వెల్ క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ పరిధిలో 217 క్లబ్‌లు ఉంటే అందులో ఆరు క్లబ్‌లది మాత్రమే హవా కొనసాగుతుందని, ఈ క్లబ్ పేరుతో నిధుల దుర్వినియోగం జరుగుతోందని అన్నారు. జిల్లాలో మూడు దశాబ్దాలుగా ఒక్కరే కార్యదర్శి పదవిలో కొనసాగుతున్నారని, ఇతరులకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రికెట్‌ను అభివృద్ధి చేయాలని బీసీసీఐ సూచించినా హెచ్‌సీఏ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధి శూన్యమని, హెచ్‌సీఏ నిర్వహించే అండర్ –14, 16, 19, రంజీ ట్రోఫీల్లో జిల్లా నుంచి ఒక్కరికి కూడా ప్రాతినిధ్యమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణకు రూ.15లక్షల చొప్పున మంజూరయ్యాయని, ఆ నిధులు ఏం చేశారో తెలియడం లేదని విమర్శించారు. సమావేశంలో టీసీఏ బాధ్యులు కూరపాటి ప్రదీప్, వరంగల్ జిల్లా క్రికెట్ కార్యదర్శి జయపాల్, చిత్తరంజన్, సీనియర్ క్రికెటర్లు వీరేష్, రాజీవ్‌రాజ్. నరేష్, వెంకట్, రాజశేఖర్, కొండా శ్రీను, నజీర్ పాల్గొన్నారు.

అమ్మవారికి శ్రావణ బోనం

శ్రావణమాసం ఆదివారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో బోనాల సందడి నెలకొంది. ముత్యాలమ్మ, మైసమ్మ, గంగమ్మతల్లి తదితర దేవతలకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంతో పాటు పలు మండలాల్లోని అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. –9లో



ఖమ్మంలో గంగమ్మతల్లికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

19న డీఈఎల్‌ఈడీలో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మం సహకారనగర్ : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్‌ఈడీ) – 2025లో అర్హత సాధించి సీటు రాని అభ్యర్థులు ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు డైట్ కాలేజీలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ బాలమురళి ఒక ప్రకటనలో తెలిపారు. 19న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్ల కేటాయింపు ఉంటుందని, డైట్‌లో ఇంగ్లిష్ మీడియంలో 5, తెలుగు మీడియంలో 8 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంకా మిగిలిన సీట్ల కోసం 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు అభ్యర్థులు హాజరు కావాలని, ప్రవేశం పొందిన వారు 21న కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని సూచించారు.

వర్సిటీలో ప్రవేశాలు

- ఎర్త్ సైన్సెస్‌లో తొలిబ్యాచ్‌గా 32 మంది విద్యార్థుల చేరిక
- విద్యార్థుల సంఖ్య పెంచేందుకు స్పాట్ అడ్మిషన్లపై దృష్టి
- యూనివర్సిటీలో సిద్ధమవుతున్న హాస్టళ్లు, తరగతి గదులు
- హై పవర్ నివేదిక వచ్చాక బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు



కొత్తగూడెంలోని ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ భవనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతిష్టాత్మక డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో దోస్త్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్ పొందారు. వారికి సౌకర్యాలు కల్పించే పనిలో వర్సిటీ పాలనా విభాగం నిమగ్నమైంది. భవిష్యత్ అవసరాలకు తగినట్టు క్యాంపస్‌ను తీర్చిదిద్దడంపై దృష్టి సారించింది. యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేషన్‌లో నాలుగు కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో రెండు కోర్సులు ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేషన్ విభాగంలో కోర్సుకు 60 సీట్ల చొప్పున 120 సీట్లతో రెండు కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించారు. అన్ని రకాల అనుమతులు వచ్చే సరికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) మూడో ఫేస్ చివరి దశలో ఉంది. దీంతో మొదటి బ్యాచ్‌లో తక్కువ మంది విద్యార్థులకే అడ్మిషన్లు దక్కాయి. బీఎస్సీ (జియాలజీ) 10, బీఎస్సీ (ఎన్విరాన్‌మెంట్) 22.. మొత్తంగా 32 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు ప్రత్యేక అనుమతులు సాధించే పనిలో యూనివర్సిటీ యాజమాన్యం ఉంది. సీపీగెట్ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్) – 2025 ద్వారా త్వరలో రెండు కోర్సుల్లో పీజీ విద్యార్థులు ఇక్కడికి రానున్నారు.

చకచకా ఏర్పాట్లు

మొదటి బ్యాచ్ విద్యార్థులకు ప్రస్తుతం ఉన్న ఇంజనీరింగ్ కాలేజీ భవనాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం క్యాంపస్‌లో మార్పులు, చేర్పులు చేపడుతున్నారు. పాత క్యాంపస్‌లో గతంలో ఎంబీఏ, ఎంసీఏ తరగతులు నిర్వహించగా, గదులను ఇటీవల ఆధునీకరించారు. వీటిలో బీఎస్సీ తరగతులు నిర్వహించనున్నారు. ఇంజనీరింగ్ కాలేజీ పక్కన ఉన్న టీచర్ల క్వార్టర్లను బాలికల హాస్టల్‌గా, ఎన్జీవోస్ క్వార్టర్లను బాలుర హాస్టల్‌గా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. క్యాంపస్‌లో అంతర్గత రోడ్లకు మరమ్మతులు, పాత భవనాలకు వైట్‌వాష్, అవసరమైన ఫర్నిచర్ తదితర ఏర్పాట్లు చేపడుతున్నారు.

స్పోర్ట్స్ ఎరేనాకు ప్రతిపాదనలు

కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌గా, ఆ తర్వాత యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌గా కొనసాగిన ఈ కళాశాల.. ఇటీవల డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ అయింది. క్యాంపస్ ఒకప్పుడు 391 ఎకరాల్లో ఉండేది. మెడికల్ కాలేజీ, ఐడీఓసీ నిర్మాణాలకు కొంత స్థలం తీసుకోగా ప్రస్తుతం 310 ఎకరాల్లో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఉంది. క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో 800 సీట్లు ఉండగా, ప్రస్తుతం 650 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంకా ఎర్త్ సైన్సెస్ విభాగానికి సంబంధించి 960 మంది విద్యార్థులు రానున్నారు. దీంతో క్యాంపస్‌లో 1,760 మంది విద్యార్థులు అభ్యసించే అవకాశం ఉంది. దీనికి తోడు ఇదే క్యాంపస్‌లో అంతర్భాగంగా ఉన్న మెడికల్ కాలేజీలో 600మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఇక్కడ వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ ఎరేనాను నిర్మించాలనే ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇందులో ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా సౌకర్యాలు, వీక్షకుల కోసం గ్యాలరీలు నిర్మించాలని యోచిస్తున్నారు. అంతకంటే ముందు నిరుపయోగంగా మారిన ఆడిటోరియానికి మరమ్మతులు చేయాలని, పాత బాలుర హాస్టల్‌ను స్టోర్‌రూమ్‌గా మార్చాలని భావిస్తున్నారు.

నివేదిక ఇంకా రాలేదు..

ఎర్త్ సైన్సెస్ పీజీ, యూజీ కోర్సుల్లో 360 మంది విద్యార్థులకు విద్యాబోధన జరగనుంది. ఆ తర్వాత పీహెచ్‌డీ విద్యార్థులు కూడా వస్తారు. వీరందరికీ అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, వర్క్‌షాప్, మెస్, హాస్టళ్లకు సంబంధించి నూతన భవనాలు నిర్మించాలి. బోధన, బోధనేతర సిబ్బంది ఎంతమంది అవసరం, ఎప్పుడు నియామకాలు చేపట్టాలనే అంశంపై ఇంకా తుది నిర్ణయం జరగలేదు. ఈ రెండు అంశాలపై ఉన్నత విద్యాశాఖ హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక వచ్చాక ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సంబంధించిన నూతన భవనాల నిర్మాణం, స్టాఫ్ విషయంలో కదలిక వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

గోపా ఉపాధ్యక్షుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దుర్గాప్రసాద్‌గౌడ్

ఖమ్మంమామిళ్లగూడెం: పాండిచేరి యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్‌కౌన్సిల్ నుంచి ఖమ్మానికి చెందిన గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఉపాధ్యక్షుడు తోడేటి దుర్గాప్రసాద్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. 20 ఏళ్లుగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన సంస్థ పాండిచేరిలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

ఒకేరోజు 18 మంది నగదు చెల్లింపు



ఫ్లాట్ రిజిస్టర్ చేసుకుంటున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహ భవన సముదాయంలో ఆదివారం ఒక్క రోజే 18 మంది నగదు కట్టి రిజిస్టర్ చేసుకున్నట్లు తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ జనరల్ సెక్రటరి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రాజీవ్ స్వగృహ నిర్మాణం, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. 60 ఫీట్ల అప్రోచ్ రోడ్డు మంజూరైందని, మున్నేరు వరద ప్రభావం రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతోందని, ఈ భవన సముదాయానికి బఫర్ జోన్ వర్తించదని కలెక్టర్ పేర్కొనటంతో పాటు అదనంగా కావాల్సిన సౌకర్యాలు కూడా ప్రభుత్వం తరఫున కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆదివారం ప్లాట్లు రిజిస్టర్ చేసుకున్నారు. అందులో డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, సూర్యాపేట జెడ్పీ సీఈఓ అప్పారావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, చింతకాని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, కె.పెద్దపుల్లయ్య, హరికృష్ణ, సాయికృష్ణ, డి.నిర్మల ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల 1981 – 84 బీఏ (ఈపీపీ) బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి ఫొటోలు, చిరునామాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. 70 ఏళ్లు దాటిన చంద్రయ్య, రామారావును సన్మానించారు. కార్యక్రమంలో జమిల్ పఠాన్, శ్రీహరి, కె.నర్సయ్య, హరినాథ్, సుదర్శన్, రౌతు రవి, ఎస్కే బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ

మధిర: పట్టణంలోని సుందరయ్య నగర్‌లో శనివారం రాత్రి విద్యుత్ మోటార్ చోరీ జరిగింది. గంగ్ర నరసింహారావు ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఇంటి యజమాని ఆదివారం ఉదయం చూడగా విద్యుత్ వైర్లు కత్తిరించి మోటార్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. ఇటీవల రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో బబ్లూకి చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. వరుస చోరీలతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ప్రేమ్‌కుమార్ మృతదేహం లభ్యం



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

గంగారం: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల జలపాతం వద్ద శనివారం సాయంత్రం గల్లంతైన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్ (23) మృతదేహం లభ్యమైంది. ఏన్కూరు మండలం జెన్నారం ఎస్టీ కాలనీకి చెందిన ప్రాపర్తి ప్రేమ్‌కుమార్ శనివారం బంధువులు, స్నేహితులతో కలిసి ఏడుబావుల జలపాతం వద్దకు వచ్చాడు. పైనున్న బావులను చూసేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడ్డాడు. దీంతో సహచరులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం ప్రేమ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. కాగా, సరదాగా జలపాతం చూడడానికి వచ్చి శవమై కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రేమ్‌కుమార్ సోదరుడు సైతం గతంలో వరద ప్రమాదంలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్



పెద్దాస్పత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగంలో సేవలు అందిస్తున్న ఆరోగ్యమిత్రలు

- ఆరోగ్య మిత్రల కొరతతో ఇబ్బందులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సేవలకు అంతరాయం
- ప్రారంభంలో 125 మంది ఉండగా, ప్రస్తుతం 68 మందితో నెట్టుకొస్తున్న వైనం
- సేవలకు దూరమవుతున్న అర్హులైన రోగులు

ఖమ్మంవైద్యవిభాగం: గత వారం కోదాడకు చెందిన ఓ మహిళకు గుండె నొప్పి రావటంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో యాంజియోగ్రామ్ నిర్వహించి స్టంట్లు వేయాలని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు ఉండగా, కుటుంబ సభ్యులు వినియోగించుకోవా లని ప్రయత్నించారు. కానీ పేషంట్‌కు సీరియస్‌గా ఉందని, వెంటనే మూడు స్టంట్లు వేయాలని యా జమాన్యం తెలపడంతో ఆరోగ్యశ్రీ ద్వారా చేయా లని కోరారు. కానీ, ఆరోగ్యశ్రీ ద్వారా రెండు స్టంట్లకే అవకాశం ఉంటుందని చెప్పటంతో చేసేది లేక హుటాహుటిన రూ.2లక్షలు చెల్లించి స్టంట్లు వేయించారు. కనీసం హైదరాబాద్ రిఫర్ చేసినా వారికి ఉచితంగా సేవలు లభించేవి. దీంతో వారు ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌కు ఆస్పత్రి యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు.

● ఇటీవల తల్లాడ మండలానికి చెందిన ఓ వ్యక్తికి రాత్రిపూట గుండె నొప్పి రావటంతో కుటుంబ సభ్యులు నగరంలోని వైరారోడ్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నా అర్ధరాత్రి కావటంతో రిజిస్ట్రేషన్ చేయటానికి ఆరోగ్యమిత్ర అందుబాటులో లేడు. దీంతో పేషంట్ పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో చేసేదిలేక డబ్బులు పెట్టి యాంజియోగ్రామ్ చేయించి, స్టంట్లు వేయించారు.

● ఇలా రోజూ ఎందరో నిరుపేద, మధ్యతరగతి రోగులు ఆరోగ్యశ్రీ సేవలకు అర్హులైనప్పటికీ నెట్‌వర్క్ ఆస్పత్రుల డబ్బుల దాహానికి బలవుతున్నారు. అంతే కాకుండా సరిపోను ఆరోగ్యమిత్రలు లేకపోవటం కూడా నెట్‌వర్క్ ఆస్పత్రులకు వరంలా మారిపోయింది. మిత్రల కొరతతో ఆయా ఆస్పత్రుల్లో మూడుషిఫ్టుల్లో పనిచేయాల్సిన వారు కరువయ్యారు. దీంతో ఉన్న వారితోనే నెట్టుకొస్తుండటంతో రోగులు తీవ్రఇబ్బందులు పాలవుతున్నారు. ఆరోగ్య శ్రీ పథకం 2008లో అప్పటి దివంగత ముఖ్యమంత్రిరాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. పాదయాత్ర సమయంలో రోగులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూసి చలించిపోయి ఆయన ఆలోచనలో వచ్చిందే ఈ ఆరోగ్యశ్రీ పథకం. అప్పట్లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా లక్షల మందికి ఉచితంగా వైద్యసేవలు అందించగా, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ సేవలు అందటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 68 మంది మాత్రమే

పథకం ప్రారంభ సమయంలో ఉమ్మడి జిల్లాలో 125 మంది ఆరోగ్యమిత్రలతో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవటంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లా లో 68 మంది ఆరోగ్య మిత్రలు మిగిలిపోయారు. అందులో ఖమ్మం జిల్లాలో 38 మంది మిత్రలు పనిచేస్తుండగా, భద్రాద్రికొత్తగూడెంలో 30మంది సేవలు అందిస్తున్నారు. జిల్లా రెండుగా విడిపోయినా ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాకు కలిపి ఖమ్మం కేంద్రంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సేవలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో అవసరమైన స్థాయిలో ఆరోగ్యమిత్రలు లేకపోవటం వల్ల రోగులకు ఆయుష్మాన్, ఆరోగ్యశ్రీ సేవలు ఆశించినస్థాయిలో అందట్లేదు. ఆరోగ్యశ్రీట్రస్ట్ ఏర్పడిన సమయంలో ఉమ్మడి జిల్లాలో కేవలం 10 ఆస్పత్రులకే అనుమతులు ఉండేవి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు 55 వరకు ఉన్నాయి. అందులో ఖమ్మం జిల్లాలో 31 ప్రైవేట్, 8 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యసేవలు అందుబాటులో ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెంలో 9 ప్రైవేట్, 7 ప్రభుత్వ ఆస్పత్రులకు అనుమతులు ఉన్నాయి.

7 లక్షలకు పైగా అర్హులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందే అవకాశం లభించింది. దీంతో ఆరోగ్యశ్రీ సేవలకు ప్రాముఖ్యత పెరిగింది. కానీ, రోగులకు అనుకున్నస్థాయిలో వైద్య సేవలు అందట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ అనుమతులు ఉన్న కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఎక్కువగా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ అనుమతులు ఉన్నప్పటికీ పలురకాల కొర్రీలు పెట్టి రోగులకు ఉచితసేవలు అందకుండా చేస్తున్నారు. ఒక్కోసారి కొన్ని ఆస్పత్రుల్లో ఇక్కడ ఆరోగ్యశ్రీసేవలు లేవని బుకాయిస్తూ డబ్బులు చెల్లించేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఉమ్మడి జిల్లాలో 7,12,461 రేషన్ కార్డులు ఉండగా వారంతా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌కు అర్హులే. రోగి ఆయా ఆస్పత్రులకు వచ్చి సేవలు పొందే సమయంలో ఆరోగ్యమిత్రలదే కీలక పాత్ర. అర్హులైన రోగులకు రిజిస్ట్రేషన్, ట్రస్ట్ నుంచి అనుమతులు పొందడంతోపాటు డిశ్చార్జ్ అయ్యే వరకు వారి సేవలు కీలకం. సరిపోను ఆరోగ్యమిత్రలు లేకపోవటం ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు ఉన్న ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు గాను సుమారు మరో 100 మంది ఆరోగ్యమిత్రలు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఆరోగ్యమిత్రలు ఉదయం, మధ్యాహ్నం, రాత్రిషిఫ్ట్‌లు చేయాల్సి ఉంటుంది. కానీ, సరిపోను సిబ్బంది లేక ఇబ్బందులు తప్పట్లేదు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో అత్యవసర సేవలు పొందేందుకు వచ్చేవారు ఆరోగ్యమిత్రలు అందుబాటులో లేక డబ్బులు చెల్లించి వైద్య సేవలు పొందాల్సి వస్తోంది. కొందరు ఆర్‌ఎంపీల మూలంగా కూడా ఆరోగ్యశ్రీ సేవలకు అర్హులైన రోగులు దూరమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కమీషన్లకు కక్కుర్తి పడి గ్రామాల్లో రోగులను ప్రైవేట్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు తీసుకొచ్చి చేర్పించి, వారితో డబ్బులు కట్టిస్తున్నారు. ఆ తర్వాత అక్కడ ఆరోగ్యశ్రీ ఉందనే విషయం తెలుసుకొని రోగులు లబోదిబోమంటున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఆరోగ్యమిత్రల కొరత ఉన్నా సర్దుకుంటూ పో తున్నాం. ఏ ఆస్పత్రి నుంచైనా ఫిర్యాదు అందితే విచారణ చేసి సంబంధిత రోగికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవే ట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తే ఫిర్యా దు చేయాలి.

–పి.శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్

కిన్నెరసానిలో 'సఫారీ'



సఫారీ వాహనం (ఫైల్)

రూ.45 లక్షలతో మూడు వాహనాలు కొనుగోలు

పాల్వంచరూరల్: రాష్ట్రంలోని అమ్రాబాద్, కవ్వాల్ అటవీ ప్రాంతాల తరహాలో జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో కూడా సఫారీ ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొండకోనలు, పచ్చని చెట్లు, జలాశయం, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం కలిగిన కిన్నెరసాని ప్రకృతి అందాలు అడుగుడుగునా ఆహ్లాదం పంచుతాయి. ఆ సోయగాలను ఆస్వాదించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కిన్నెరసాని అభయారణ్యంలో ఎకో టూరిజంపై దృష్టి సారించింది. సఫారీ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

దీపావళిలోపు ప్రారంభం

ఎత్తైన కొండల మధ్య జలాశయం, అందులో నాలుగు దీవులు ఉన్నాయి. జలాశయాన్ని ఆనుకుని గుట్టపై 9 కాటేజీలు, అద్దాలమేడల నిర్మాణం చేపట్టారు. రెండు బోట్లు ఉండటంతో రిజర్వాయర్‌లో పర్యాటకులు జలవిహారం చేస్తారు. రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతుండగా అటవీశాఖ అధికారులు సఫారీని అందుబాటులోకి తేనున్నారు. డీర్ పార్కు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బేస్ క్యాంపు వరకు అభయారణ్యంలో వన్యప్రాణులను తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.45 లక్షలతో పదిమంది కూర్చునే మూడు సఫారీ వాహనాలను వైల్డ్‌లైఫ్‌శాఖ అధికారులు కొనుగోలు చేశారు. దీపావళి లోపు సఫారీ ప్రారంభించాలని నిర్ణయించారు. దీంతో పర్యాటకులకు ఆహ్లాదంతోపాటు అటవీశాఖకు ఆదాయం లభించనుంది.

ఎకో టూరిజం అభివృద్ధి..



అభయారణ్యంలో మరో రెండు నెలల్లో కో టూరిజం అభివృద్ధి పనులు చేపడతాం. ఈ క్రమంలో సర్వే కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సైక్లింగ్, ట్రెక్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించే ఆలోచన చేస్తున్నాం. డీర్ పార్కు నుంచి చింతోనిచెలక మీదుగా రంగాపురం, సిద్దారం వరకు సఫారీ ఏర్పాటు చేస్తాం.

–కృష్ణాగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

'పోలవరం'తో భద్రాచలానికి ముప్పు

- ఏపీ సీఎం చంద్రబాబు బ్రెయిన్, గుండె మోదీకి ఇచ్చేశాడు
- మీడియా సమావేశంలో రాజ్యసభ సీపీఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిటాస్



మాట్లాడుతున్న సీపీఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిటాస్

భద్రాచలం అర్బన్: పోలవరం ప్రాజెక్ట్ కారణంగా భద్రాచల పట్టణం, పరిసర గ్రామాలను గోదావరి వరదలు ముంచెత్తుతున్నాయని సీపీఎం రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిటాస్ అన్నారు. ప్రాజెక్ట్ పూర్తయితే బ్యాక్ వాటర్‌తో వరదల తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. ఆదివారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం కాపర్ డ్యాం వల్ల ప్రజలు ఇప్పటికే గృహనష్టాలు, జీవనోపాధితోపాటు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. ఈ సమస్యను కేంద్రం అత్యవసరంగా పరిగణించి నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భద్రాచలం శ్రీరాముని ఆలయంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష వీడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసి ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామాలను తెలంగాణలోకి తేవాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల వేదిక నుంచి ప్రధానమంత్రి ఆర్‌ఎస్‌ఎస్‌ను మాత్రమే ప్రస్తావించడం దేశ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్‌వాదులు, కమ్యూనిస్టులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, మహిళలు ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, అనేక మంది విప్లవకారులు ఉరిశిక్షలు ఎదుర్కొన్నారని, కానీ కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌నే పొగడటం చరిత్రను వక్రీకరించడమేనని పేర్కొన్నారు. ట్రంప్‌తో స్నేహం పెంచుకున్నానని చెబుతున్న ప్రధాని మోదీ.. ఆ స్నేహం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడకపోతే అర్థమేమిటని ప్రశ్నించారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బ్రెయిన్, గుండె మోదీకి అప్పగించారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కారం పుల్లయ్య, ఎం.బి నర్సారెడ్డి, గద్దం స్వామి, వంశీకృష్ణ, బండారు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రావణమాసం కావడంతో అమ్మవారి దర్శనం కోసం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చారు. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేషపూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నీటమునిగిన నారచీరల ప్రాంతం



నారచీరల ప్రాంతంలో నీట మునిగిన సీతమ్మ విగ్రహం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో సీతమ్మవారి నారచీరల ప్రాంతం నీట మునిగింది. మండలంలో కురుస్తున్న వర్షాలకు తోడు గోదావరికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో నారచీరల ప్రాంతం చుట్టూ నీరు చేరి సీతమ్మ విగ్రహం నీట కూడా మునిగింది. పర్ణశాల ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని నారచీరల ప్రాంతం దర్శించుకోకుండానే వెనుదిరుగుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

మధిర: మండలంలోని మల్లారం గ్రామంలో నల్లమల శేఖర్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతిచెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తగలటంతో ఎద్దు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, విద్యుత్ శాఖాధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

గోడ కూలి వృద్ధురాలికి గాయాలు

అశ్వాపురం: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో వృద్ధురాలు యన్నం రాములమ్మ ఇంటికి సంబంధించిన మట్టి గోడలు ఆదివారం కూలాయి. ఇంట్లోఉన్న రాములమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.

బాల్య వివాహానికి అడ్డుకట్ట

రఘునాథపాలెం: మండలంలోని గ్రామానికి చెందిన బాలికను ఖమ్మం నగరం దానవాయిగూడేనికి చెందిన 33 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపిస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. దానవాయిగూడెంలోని సాయిబాబా గుడిలో రహస్యంగా పెళ్లి జరుగుతున్నట్లు గుర్తించి వెంటనే ఆపేశారు. పదో తరగతి పూర్తి చేసిన బాలిక వయస్సు కేవలం 15 ఏళ్ల 8 నెలలుగా అధికారులు గుర్తించారు. వారిని పోలీసుల సహకారంతో బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరు పరిచారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బాల్యవివాహం మానుకునేలా ఒప్పించారు. ఉన్నత చదువులు కొనసాగించేందుకు బాలికకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం బాలికను బాలల సంరక్షణాలయంలో చేర్పించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు అనిత, లింగయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశీల, 1098 సిబ్బంది చైతన్య, అంగన్వాడీ టీచర్లు పద్మ, స్వర్ణ, ఉమ, కానిస్టేబుల్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడికి విద్యుదాఘాతం

కారేపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుడికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సింగరేణి గ్రామ పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్న దుండి లచ్చయ్య కుమారుడు నాగేశ్వరరావు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంకోసం గుంతలు తీశాడు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో పిల్లర్ల గుంతలు నీటితో నిండిపోవటంతో, వాటి ని తోడేందుకు విద్యుత్ మోటార్ అమర్చాడు. లచ్చయ్య విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేసి నీటిని తోడే ప్రయత్నం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన నాగేశ్వరరావు భార్య అక్కడికి వెళ్లగా ఆమెకు సైతం విద్యుత్ షాక్ తగిలింది. ఆమె కేకలు వేయటంతో అటుగా వెళ్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ బి.వెంకన్న వచ్చి స్విచ్ బోర్డు నుంచి ప్లగ్‌ను తొలగించాడు. దీంతో ప్రమాదం తప్పినట్లయింది.లచ్చయ్యకు తీవ్రగాయాలు కాగా, నాగేశ్వరరావు భార్యకు స్వల్పగాయాలయ్యాయి. వార్దిరినీ కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం లచ్చయ్యను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపాలెం: కడుపునొప్పి తాళలేక గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి చెందిన ఘటన రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. మండలంలోని హర్యాతండాకు చెందిన గుగులోతు నందా (55) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు చోట్ల చికిత్స చేయించుకున్నా ఫలితం లేక పోవడంతో శనివారం గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మంగీలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

జ్వరంతో ఇద్దరు మృతి



తద్దె స్వాతి (ఫైల్)

కొణిజర్ల: జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలోని తనికెళ్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తనికెళ్లకు చెందిన తద్దెస్వాతి (18) ఖమ్మంలో డిగ్రీ చదువుతోంది. నాలుగు రోజుల కిందట తీవ్రజ్వరం రావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో రెండు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. విద్యార్థిని డెంగీ లక్షణాలతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరణ కోరేందుకు పెద్దగోపతి వైద్యాధికారులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

డెంగీ లక్షణాలతో బాలుడు



బలమాల వినయ్ (ఫైల్)

డెంగీ లక్షణాలతో బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని గుబ్బగుర్తిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బలమాల ప్రసాద్, అనూష దంపతుల కుమారుడు వినయ్ (5) నాలుగురోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్నాడు. ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. డెంగీ లక్షణాలతోనే బాలుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఆర్థిక బాధలు తాళలేక ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఆర్థిక బాధలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం త్రీటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మోహన్‌బాబు కథనం ప్రకారం.. పంపింగ్‌వెల్‌రోడ్ ప్రాంతానికి చెందిన లింగనబోయిన నాగరాజు (40) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. అంతేకాకుండా ఆయన కుమార్తె మెదడువాపు వ్యాధితో బాధపడుతోంది. భార్య ఆరోగ్యం కూడా బాగా లేకపోవటంతో మనస్థాపానికి గురై ఈ నెల7న ఎలుకలమందు తాగాడు. ఆయన్ను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. అయ్యవారిగూడెం సమీపంలో కొద్ది రోజులుగా కొందరు పేకాట ఆడుతున్నారు. సమాచారం మేరకు ఆదివారం స్థానిక పోలీసులు పేకాట కేంద్రంపై దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.7,240 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో 9 మంది పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.